# హైటెక్ అల్లుడు

ఆకాశ మైదానములో సూర్యకిణాలు మబ్బు కన్యలతో దాగుడు మూతలాడు కుంటున్నాయి. పెరట్లో జామచెట్టు రెమ్మలు కొమ్మలతో గాలికబుర్లాడుతున్నాయి.

"తాతయ్యా ! నేనో పొడుపుకథ పొడవనా !"

"ఓ ... "

"మరి నువు విప్పాలి"

"ఓ ...."

"జామ చెట్టు కింద జానమ్మా, ఎంత గుంజినా రాదమ్మా"

"ఓ ...."

"పో తాతతయ్యా... అన్నింటికీ ఓ అంటున్నావు." చిన్నారి సుధీర్ బుల్లిచేతులు నగరేశం మీసాలు లాగాయి.

"వామ్మో ... నా మీసాల్రోయ్." ఒడిలో గంతు లేసిన మనవడి నెత్తి మీదో మొట్టికాయ పడింది. పైరగాలి నవ్వింది. వెంటనే చిలక్కొట్టిన జామపండు నగరేశం నెత్తిమీద పడింది. దాన్ని మనవడి నోటికందించాడు.

"మరి నా పొడుపు కథో" జామపండు కొరుకుతూ బుంగమూతి పెట్టాడు సుధీర్. "విప్పక పోతే మీసాలు మరోసారి లాగుతా" వార్నింగ్.

"అమ్మాయ్ నీలూ !" నగరేశం నాలుగేళ్ళ పిల్లాడిలా మారిపోయాడు "చూడమ్మా నీ సుపుత్రుడూ ..." కమ్మని కంప్లయింట్.

సంక్రాంతి పండక్కి మూడ్రోజుల ముందే వచ్చిన పెద్దకూతురు నీలవేణిని కేకేశాడు. వంటింట్లో తల్లితో పిచ్చాపాటిలో మునిగిన నీలవేణి దాకా వెళ్ళలేదది.

పెరట్లో జామచెట్టు. జామచెట్టు కింద పడక్కుర్చీ. పడక్కుర్చీలో తాతా మనవళ్ళు. చలికాలం నీరెండ పున్నమి వెన్నెలలాగున్నది. జామచెట్టు నీడలు నేలమీద ఉయ్యాల లూగుతున్నాయి.

"ఇదేమో జామచెట్టు, జానమ్మంటే నీడ. దాన్నెంత గుంజినా చేతికి రాదు గదరా !" అంతవయసులో ఐదేళ్ళ పిల్లాడిలా చేతులూపుతూ పొడుపుకథ విప్పేశాడు.

"బలే బలే ..." సుధీర్ కేరింతలు. చప్పట్లు చరుస్తూ "మా తాతయ్య మాంచి తాతయ్య" గారాబంగా చెంపలందించాడు. మనవడిని మనసారా ముద్దాడుతూంటే మానస సరోవరములో ఈదులాడుతూ వసంత కోయిల గానము వింటున్నట్టుంది.

పసివాడు గుండెలకు హత్తుకుపోయాడు. ఏదో పారవశ్యం... పారవశ్యంలో పరాకు ఆలోచన... "హబ్బ ! ఇదే నీలవేణికి అదే అమెరికా సంబంధం దొరికితే ఇంకెంత బాగుండేదో .... !?" మనసు పొరల్లో సన్నని మూల్గు. ప్చ్... దేనికైనా అదృష్టం ఉండొద్దూ !

"సుధీర్ .... నాన్నా సుధీర్ !" నీలవేణి పిలుపు. "చిన్నమ్మ వచ్చేసింది రారా."

చిన్నారి పెదాలు సున్నా చుట్టుకున్నాయి. కళ్లుకాంతి పుంజాలైనాయి. సర్రున జారి బుర్రున పరుగెత్తాడు.

ధరణి వచ్చేసిందా ! అవును .... నా తల్లి వచ్చేసింది. అదో .... తల్లితో మాట్లాడ్తోంది. వెంటనే చూడాలి... ఉత్సాహం ఉరకలేసింది. పడక్కుర్చీ లోంచి లేచి పదడుగులు ముందుకేశాడో లేదో, చిరునవ్వులు చిందిస్తూ "నాన్నా .... బాగున్నావా నాన్నా !" ధరణి ఎదురొచ్చింది. తండ్రి చేతులందుకుని కళ్ళకద్దుకుంది. "ఆరోగ్యం బాగుందా నాన్నా !"

"ఓ... బాగుందమ్మా అల్లుడు గారెప్పుడొస్తారమ్మా ?" కుడిచెయ్యి ఆప్యాయంగా తలనిమిరింది.

"రేపో ఎల్లుండో వస్తారు నాన్నా. ఆయన పోస్టల్ ఉద్యోగి గదా ! పోస్టల్ ఉద్యోగికి లీవు దొరకాలంటే పరమాత్మ ప్రత్యక్షమైనంత విలువగదా !"

"నిజమే ... కాని నువ్వే ఏరికోరి ప్రేమించి పెళ్ళి చేసుకున్నావు గదమ్మా !"

"ఏదోలే నాన్నా ! ఆయనది మంచి మనసు. కష్టపడి పంచేసే అలవాటుంది."

"ఆఁ... ఏం మనసో లేమ్మా, ఆరునూరైనా... ఇల్లు అమ్మైనాసరే నీకోసం అమెరికా సంబంధం వెతుకుతూంటే నువ్వేమో ... నేను పట్టుకున్న కుందేలుకు మూడేకాళ్ళు అన్నట్టు మంకుపట్టు పడితివి" అందామనుకున్నాడు. మనసు పొరల్లోంచి దొర్లుకొచ్చిన ఆ మాటల్ని గొంతులో అదిమిపెట్టక తప్పలేదు. అయినా ... అనుకున్నవన్నీ అక్షరాలా నిజమైతే ఆ దేవునికి దండంబెట్టే మనిషుంటాడా ! "నీ ఆరోగ్యం బాగుందామ్మా ?"

"చెల్లికేం నాన్నా ! గుండ్రాయిలాగుంది" నీలవేణి కల్పించుకుంది. "అన్నట్టూ... ధరణి నీకో మనవరాలి నివ్వబోతుంది నాన్నా !" చెల్లి నెత్తిమీదో మొట్టికాయ వడ్డించింది.

ధరణి బుగ్గలు సిగ్గుల భారంతో ఎర్రమందారాలైనాయి.

"మాయమ్మే ..." నగరేశంలో సంతోషం పొంగింది.

"ఎంత చల్లని వార్త చెప్పావమ్మా !" నీలవేణి ఎడమచెయ్యి కుడిచేతిలో కొచ్చింది. నా తల్లులు... సాక్షాత్తూ లక్ష్మీపార్వతుల్లాగున్నారు. ఇద్దరు కూతుళ్ళ చేతుల్ని కళ్ళకద్దుకున్నాడు. వాత్సల్యం వరదలై ఎద పొంగించింది. ఆహా ! పేగుబంధానికి

మించిన సంబంధ మీ ప్రపంచంలో మరేదీ లేదన్నారిందుకేనేమో !

ఆఁ... అయినా ఏం లాభం ! కనీసం ఒక్క కూతురన్నా అమెరికాలో ఉంటే ఎంత బావుండేదో ! హైటెక్, హైక్లాసు అల్లుడని అందరూ పొగడ్తల్తో ముంచెత్తేవారు. తనగ్గూడా అమెరికా సందర్శన సౌభాగ్యం లభించేది. నయాగరా జలపాతం హొయల్ని నయనానందకరంగా చూసే అదృష్టం కలిగేది....

"నాన్నా ! రిటైరయ్యాక పొద్దెట్లా గడుస్తుందీ ?" ధరణి తల భుజమ్మీద ఒరిగి పోయింది.

ఫ్చ్ ... మనిషి ఆశలు, ఆరాటాలకు రిటైర్మెంటొక ఫుల్‌స్టాప్. పదివేల రూపాయలు జీతాని కలవాటు పడిన జీవితం ముచ్చిమూడువేల రూపాయల పెన్షన్‌తో రాజీపడాలి. మనసు మూల్గింది.

"ఆఁ.... ఏముందమ్మా ! పొద్దున్నే వాకింగ్, స్నానం పూజాదులు ముగించుకుని న్యూస్‌పేపర్లో తల దూర్చడం, మధ్యాహ్నం కునుకు దియ్యడం..." చెప్పుకుపోతున్నాడు.

"ఆ తర్వాత సాయంత్రం వెంకట్రావు మావయ్యతో కలిసి ఈవినింగ్ వాకింగ్..." భార్య అన్నపూర్ణ అందుకుంది. "పార్కులో టాకింగ్ లేదా ఇంట్లో చదరంగం... ఇదమ్మా మీ నాన్నగారి దినచర్య." మూతి, ముక్కు తిప్పుతూ "ఇంత వయసొచ్చినా పెళ్ళాం సంగతి, పెళ్లినాటి ముచ్చట్లేవీ గుర్తుకు రావమ్మా !" చేతులు గూడా తిప్పేసి ముక్కుమీద వేలేసుకుంది. చెంపలమీద సిగ్గుల ఛాయలు...

ముగ్గురూ నవ్వేశారు. ఆ నవ్వు త్రివేణీ సంగమం సవ్వడిలాగుంది. ఫోన్ మోగుతున్న శబ్దం వినబడింది. అన్నపూర్ణ వెళ్ళి మాట్లాడి వస్తూ

"నాన్నా కూతుళ్ళ నవ్వులు బాగానే ఉన్నాయి గాని వెంకట్రావ్ అన్నయ్య ఫోన్... లైన్లో ఉన్నాడు. తమరితోనే మాట్లాడాలంటా ..." మరోసారి చేతులు తిప్పేసింది.

"అలాగా !" కీ ఇచ్చి వదిలిపెట్టిన బొమ్మ రైలులా పరుగెత్తాడు నగరేశం. "అమెరికా నుండి వాని అల్లుడొచ్చాడేమో !"

విస్తుబోయి మొహాలు చూసుకోవడం తల్లీ కూతుళ్ళవంతయింది.

❋❋❋

వెంకట్రావింటికి ఆబగా పరుగెత్తుకొచ్చిన నగరేశంకు ఆశ్చర్యమేసింది. ఇంట్లో తానూహించిన హడావుడేమీ లేదు. వసారాలో ఎవరూ లేరు. ఇంటి నిండా నిశ్శబ్దం పరుచుకునుంది. తానే వెళ్ళి ఫ్యాను వేసుకుని కుర్చీలో కూచున్నాడు. చూపులు అటూ, ఇటూ పరిగెడుతున్నాయి.

టీ.వీ. స్టాండు పక్కన కొత్తరకం పెద్దసూటుకేసు కనబడింది. రంగురంగుల సూటుకేసు... అద్దం లాగుంది. ఆఁ... అది అమెరికాదే. వెంకట్రావు కూతురు సువర్చలదే.

కూతురు అల్లుడు గారితో కలిసి పెరట్లో బాతకానీ వేసుకున్నారేమో ! అవును మరి... సప్తసముద్రాల అవతలి నుండి విమానములో ఎగిరొచ్చిన అమ్మాయి - అల్లుడంటే మాటలా, మజాకా !... ఆసక్తి అల్లరి పెడుతోంది. గోదావరి బేసిన్‌లో గ్యాసులా ఉత్సాహం ఉబికొచ్చింది. గోడగడియారం టక్‌టక్ మంటోంది. ఉహూ ! ఇప్పుడప్పుడే బయటికి రారు. వెంకట్రావు చిన్నప్పట్నుంచీ అంతే... ఎవరితోనన్నా లోకాభిరామాయణానికి దిగాడంటే ఈ లోకాన్ని మరచిపోతాడు.

ఫ్యానుగాలి ఒంటిని చల్లగా స్పర్శిస్తోంది. మనసు వేడి మారాము చేస్తూనే ఉంది. అయినా లోపలికెళ్ళి తానుగూడా వాళ్ళలో కలిసిపోవచ్చుగదా ! అందుకు తననడ్డుకునే వారెవ్వరూ ? ఉల్లాసంగా లేచి కదిలాడు. వంటింట్లో ప్రవేశించాడు. అక్కణ్నుండి పెరట్లో కెళ్ళాలి. అడుగులు ముందుకు పడుతున్నాయి.

"అల్లుడుగారెందుకు రాలేదమ్మా ?" వెంకట్రావు గొంతు... కాళ్ళకు బ్రేకులు వేసింది. దృష్టి పెరటివైపు దూసుకెళ్ళింది.

దానిమ్మ చెట్టు నీడన వెంకట్రావు, పక్కన తల్లి ఒడిలో తలదూర్చిన సువర్చల నేలమీద కూర్చున్నారు.

"చెప్పమ్మా ... !" తల్లి అడిగింది.

తల్లి ఒడిలోంచి గుంభనంగా తలదీసి సర్దుక్కూచుంది సువర్చల. ఆకుపచ్చని పీతాంబరం, నుదుట ఎర్రని కుంకుమబొట్టు, మూడురాళ్ళ ముక్కుపుడక మెరుపులు... ఓఫ్ ! వన దేవతలాగుంది.

"ఏం చెప్పాలి నాన్నా !" గొంతులో మార్దవం.

నగరేశం నడకముందుకు సాగలేదు. అక్కడే ఆగిపోయాడు.

"బిజినెస్ బిజీయా ?" తండ్రి సందేహం.

"అవేవీ కావు..." కూతురు వాలకంలో గాంభీర్యం.

"అదేమిటో నేనూహించగలను." నగరేశం ఆసక్తి ఆగలేకపోయింది.

"నువ్వా నగరీ... రారా !" వెంకట్రావుకు ప్రాణం లేచొచ్చినట్లయింది.

"రా అన్నయ్యా ... కూచో !"

"వస్తున్నా.... వస్తున్నా చెల్లెమ్మా !" సువర్చల నెన్నో అడగాలనే ఆతృత పెరట్లోకి లాక్కెళ్ళింది. దానిమ్మ చెట్టుకు రెండు పక్కలా పూలమొక్కలు తాదాత్మ్యంగా తలలాడి స్తున్నాయి. పూచిన పూలు కులాసాగా నవ్వుతున్నాయి.

"అమెరికా నుండి వచ్చిన గారాల కూతుర్ని పెరట్లో కూచోబెట్టావేమిట్రా వెంకటీ? వసారాలో కూచుని మనసారా మాట్లాడుకోవచ్చు గదా !" మందలింపు వెన్నుపూసకు వెన్నపూస పూతలాగుంది.

"వద్దు మావయ్యా, ఇక్కడే కూచుందాం." అంటూంటే సువర్చల దొండపండు పెదాలమీదో చిరునవ్వు ఇలా మెరిసి, అలా మాయమైంది. నగరేశం కళ్ళు సువర్చల మీదున్నాయి.

మా తల్లే ! పసితనములో పారాడిన పెరటితో ఎంత అనుబంధమో ! "సరే" కండువా సర్దుకుని తానూ కూచున్నాడు. "మీ శ్రీవారు అక్కడి పనులన్నీ చక్కబెట్టుకుని, అందరికీ బహుమతులు కొనుక్కుని దర్జాగా పండగనాడు దిగుతారు గదమ్మా !"

వేటగాడి అలికిడి విన్న లేడిపిల్లలా – సువర్చల తల తటాలున పైకి లేచింది. కనురెప్పలు టపటప కొట్టుకున్నాయి. క్షణాల్లో మేఘావృతమైన శ్రావణ ఆకాశంలా మొహంలో రంగులు మారాయి. నల్లని కళ్ళల్లో మంచుపొరలు మెరుస్తున్నాయి. అవి ఆణిముత్యాల్లాంటి ఆనందబాష్పాలను రాల్చేస్తాయేమో !

"ఆయన రాడు మావయ్యా. అక్కడే హాయిగా, మహారాజులాగుంటాడు." తల్లిదండ్రులను చెరో కంటితో చూస్తోంది. మంచుపొరలు కరిగి అశ్రుధారలై కపోలాలను తడిపేస్తూ నేలమీద రాల్తున్నాయి. పెదాలు సన్నగా వణుకుతున్నాయి.

"అదేమిటమ్మా ?" కన్నతల్లి గుండెలు అయోమయంతో గుబగుబలాడాయి. తండ్రి కడుపులో కల్లోలం బయలుదేరింది.

"నీ మెడలో మూడుముళ్ళు పడి ఐదారేళ్ళయింది గదమ్మా !" నగరేశంకేమీ అర్థం కాలేదు. కామెడీ సినిమాలో ట్రాజెడీ సంభాషణలు వింటున్నట్టుంది.

"అవును మావయ్యా !" సువర్చల వర్చస్సు మబ్బులు కమ్మిన ఆకాశంలాగైంది. "మా పెళ్ళయాక మొదటి సంవత్సరం స్వర్గంలో గడిచింది. రెండో సంవత్సరం మామూలుగా గడిచింది. మూడో సంవత్సరం మొండికేసింది." అరచేతులను మొహమ్మీద కప్పుకుని తల్లి ఒడిలో ఒరిగిపోయింది.

"అయ్యో... ఏమైందమ్మా !" తల్లి బోర్మని కూతుర్ని కౌగలించుకుంది.

విషయమేమిటో పూర్తిగా అర్థం కాలేదు వెంకట్రావుకు.

"అట్లెట్లానమ్మా ?" వెన్నుపూసలో సన్నని వణుకు.

"పెళ్ళయాక సంవత్సరం తర్వాత ఇక్కడి కొచ్చి సంతోషంగా వెళ్ళారు గదమ్మా" నగరేశం మెదడు పొరల్లో పురుగులాంటిదేదో తిరుగుతోంది. "మీ ఆయన దర్జాకు,

మాటల తీరుకు మేమంతా డంగై పోయామమ్మా. అయినా ... ఆలుమగల మధ్య అభిప్రాయ బేధాలేమన్నా తలెత్తినా అద్దమ్మీది ఆవగింజల్లా జారిపోతాయమ్మా."

"మామూలు అభిప్రాయభేదాలలాగే ఉంటాయి కాని... !" సువర్చల సర్దుక్కొచుంది. "అలాంటి మనిషి మనస్తత్వాన్ని మార్చడం మానవ మాత్రుల కసాధ్యం మావయ్యా !" కళ్ళు మంచులైనాయి.

"మనస్తత్వమా !" నగరేశం భృకుటి పీట ముడేసుకుంది. "వాళ్ళూ తెలుగు వాళ్ళేననీ, అబ్బాయి ముత్తాతగారి హయాములో అక్కడ స్థిరపడ్డారన్నారు గదమ్మా" గుర్తు చేశాడు.

ఓ నిమిషం గాలి స్తంభించింది. నిశ్శబ్ద శబ్దాలు మనసుల నుడికిస్తున్నాయి. ఎక్కడి నుంచో సుడిగాలి చుట్టుకొచ్చి చెట్లకొమ్మల్ని నాట్యమాడించింది. ఓ దానిమ్మ రెమ్మ రాలి నలుగురి మధ్య పడింది. వెంకట్రావు వెర్రిగా చూస్తున్నాడు.

"అసలు సంగతేమిటో అమ్మానాన్నలకు చెప్పమ్మా !" నగరేశం బుజ్జగించాడు. తల్లికొంగు కూతురు కళ్ళనద్దింది. సువర్చల చూపులు ముగ్గుర్ని తడిమాయి. ఏదో చెప్పబోయింది. మాటలు బయటికి రాలేదు. అవమాన భారంతో తల వంగిపోయింది.

"అమ్మా సువర్చలా !" నగరేశం సముదాయింపుకు దిగాడు." కనిపెంచిన తల్లిదండ్రులు కలకాలం తమ పిల్లల సుఖసంతోషాలనే కళ్ళారా చూడాలను కుంటారు. మేము గూడా అదే కోరుకున్నాము. కూతుళ్ళకు ఆస్ట్రేలియాదో లేదా అమెరికాదో సంబంధం దొరికితే హాయిగా ఉంటారని కలలుగన్నాము. ఒక్క నీ విషయములో మాత్రమే మా ఆరాటము ఆచరణకొచ్చిందని మురిసిపోతున్నాము. అసలేం జరిగిందో... కన్నవారికి చెప్పక తప్పదు గదమ్మా. పోనీ... నేను వెళ్ళి పోతానమ్మా" అరచెయ్యి నేలకానించి లేవబోయాడు.

"వద్దు ... లేవద్దు మావయ్యా. కూచో" నేలమీది చేతినలాగే పట్టుకుంది సువర్చల.

"మా నాన్నెంతో నువు గూడా అంతేగదా మావయ్యా !" కనుకొలుకుల్లో వింత మెరుపు.

"మరైతే చెప్పుతల్లీ !" వెంకట్రావులో భయాందోళన.

"ఆయన నాకు విడాకులిచ్చి మరో అమెరికా అమ్మాయితో ఉంటున్నాడు" సువర్చల చూపులు నేలకు వాలాయి. పక్కనే ఉన్న గ్యాసు సిలెండ్ ఫటేల్న పేలి నట్టని పించింది.

"అదెట్లా ?" నగరేశం పిడికిళ్ళు బిగుసుకుంటున్నాయి.

"అదంతే మావయ్యా !" సువర్చల నిట్టూర్పులో నిర్వేదం తొంగిచూసింది. "అక్కడి ఆచార వ్యవహారాల ప్రకారం ఆడైనా, మగైనా స్వేచ్ఛాజీవులు. సంసారాలలో నైతికపరమైన కట్టుబాట్లు నామమాత్రమే. అక్కడ స్థిరపడిన వాళ్ళ పిల్లలు ఆదేశ ఆచారవ్యవహారాల కలవాటు పడ్డం వింతేమీ కాదు గదా. పెళ్ళికిముందే యువతీయువకుల డేటింగ్, స్వేచ్ఛా విహారం... అదొక థ్రిల్లు. పెళ్ళయేదాకా ఫోజులు కొట్టడం, సంసార సుఖాలనుభవించడం పెళ్ళయి మోజు తీరాక ఎవరికి వారే యమునాతీరే. కొత్త జంట కోసం పరుగులెత్తడం, పెళ్ళికి పెడాకులు, విడాకులు... మామూలు విషయాలు. హత్యలూ, ఆత్మహత్యలు... అన్నీ రొటీనే. పెళ్లంటే నూరేళ్ళపంట కాదు, మూన్నాళ్ళ ముచ్చట. దాంపత్య జీవితంలో రాజీలేనేలేదు. కొన్నాళ్ళ దాకా పిల్లలు పుట్టకుండా జాగ్రత్త పడ్డం... ఒకందుకు మంచిదే అయింది."

"ఇలాంటి విషయాలెవ్వరూ చెప్పలేదు తల్లీ. చూస్తూ చూస్తూ నీ గొంతు కోశామమ్మా !" వెంకట్రావు తలపట్టుకున్నాడు.

తల్లి... కొంగు నోట్లో కుక్కుకుని వెక్కుతోంది.

"నాలాగా ఎందరో ఉన్నారు నాన్నా. అందుకే అక్కడున్న యువతీయువకులు ఇక్కడి సంబంధాలనే కోరుకుంటారు. వెనకాముందాలోచించకుండా అమెరికా అల్లుని కోసం వెంపర్లాడ్డం ఏరికోరి ఎండమావుల వెంట పరుగుత్తడమే."

అవాక్కయి నోరు దెరవడం నగరేశం వంతయింది.

***(జాగృతి, 18-10-2004)***

